# ఆలయ పునర్నిర్మాణ వేళ 'ప్రోటోకాల్' రగడ!

- కట్టమూరులో జనసైనికుల ఉగ్రరూపం.. ఎమ్మెల్యే పర్యటన అడ్డగింత
- శిలాఫలకంపై డీసీసీబీ చైర్మన్ పేరు మాయం.. ఈవో తీరుపై ఆగ్రహజ్వాలలు
- పదివేల మందికి అన్న ప్రసాదం అని చెప్పి.. వెయ్యి మందికే పరిమితం చేస్తారా అంటూ భక్తుల ఆగ్రహం
- పోలీసుల సహాయంతో పరారైన ఈవో






**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 13 :** కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలోని పురాతన శ్రీ కేశవ పట్టాభిరామస్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్టా మహోత్సవం రాజకీయ రణరంగంగా మారింది. భక్తిభావంతో సాగాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం, ప్రోటోకాల్ ఉల్లంఘనల కారణంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆలయ శిలాఫలకంపై స్థానిక నేత, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేరును విస్మరించడం జనసేన కార్యకర్తలలో ఆగ్రహావేశాలను రగిల్చింది.

ఎమ్మెల్యే పర్యటనలో హైడ్రామా

ఆలయ శిలాఫలకాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను జనసేన శ్రేణులు అడ్డుకున్నాయి. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన నేతలను, డీసీసీబీ చైర్మన్‌ను విస్మరించడంపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. తమ నాయకుడి పేరు లేని శిలాఫలకాన్ని ఎలా ప్రారంభిస్తారని అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యేను చుట్టుముట్టడంతో ఒకింత ఉద్రిక్తత చోటుచేసుకుంది.

ఈవో తీరుపై 'జనసైనికుల' గర్జన

దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో ) కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఉద్దేశపూర్వకగానే ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కారని జనసేన నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీసీసీబీ చైర్మన్ పేరు ఉండాల్సి ఉండగా, ఈవో అహంకారపూరిత వైఖరి వల్లే ఈ వివాదం తలెత్తిందని వారు ఆరోపించారు. అధికారుల ఏకపక్ష ధోరణి నశించాలంటూ ధ్వజమెత్తారు.

అన్నప్రసాద వితరణలో ఘోర వైఫల్యం

మరోవైపు, సుమారు పదివేల మంది భక్తులు వస్తారని అంచనా వేసినా ఈ వేడుకలో అన్నప్రసాద వితరణ అభాసుపాలైంది. కనీసం వెయ్యి మందికి కూడా సరిపడా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. "భక్తుల మనోభావాలతో ఆడుకుంటారా?" అంటూ ఈవోపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల దుర్వినియోగం లేదా ప్రణాళికా లోపం వల్లే ఇలా జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మొత్తానికి పవిత్రమైన ఆలయ పునర్నిర్మాణ వేడుక అధికారుల నిర్లక్ష్యం కారణంగా వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఈవో శ్రీనివాస్ కు వార్నింగ్!

కట్టమూరులో ఉద్రిక్తత పెరగడంతో అక్కడి నుంచి తప్పించుకుని ఈవో పోలీసుల సహకారంతో పిఠాపురం పరారవ్వడంతో ఈవో జగన్మోహన్ శ్రీనివాస్‌ను జనసేన జిల్లా అధ్యక్షుడు రామస్వామి (బాబు) అక్కడ నిలదీశారు. ప్రభుత్వ నిబంధనలు మీ చుట్టాలు కావు. ప్రోటోకాల్ అతిక్రమించి, కూటమి నేతలను అవమానిస్తే సహించే ప్రసక్తే లేదని, మీ ఇష్టారాజ్యానికి వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం అంటూ ఈవోను ఘాటుగా హెచ్చరించారు. ఇటువంటి అధికారుల తీరుపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని జనసేన కార్యకర్తలు సైతం హెచ్చరించారు.

# ఎలుబండి వారి కుటుంబాన్ని పరామర్శించిన తుమ్మలపల్లి



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్ 13:** గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన ఎలుబండి సతీష్ నాన్నమ్మ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసి, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో మలిరెడ్డి అప్పారావు, పల్లా ప్రసాద్, దారాబల్ల సద్గురు మూర్తి, నేదురి సతీష్, జానా, దూది శ్రీను, చింతపల్లి బుజ్జి, నేదురి జనార్దన్, అడబాల గణేష్ తదితరులు ఉన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పరుగుల వీరుడు యాతం నాగబాబు





- 3 పతకాలతో రికార్డు
- నాగబాబును అభినందించిన కలెక్టర్ ఎస్పీ

**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 13:** జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన సామర్లకోట వాసి యాతం నాగబాబును జిల్లా కలెక్టర్ హరీందర్ ప్రసాద్, జిల్లా పోలీస్ సూపరిండేటెంట్ బిందు మాధవ్ అభినందించారు. ఈ నెల ఏప్రిల్ 9 నుంచి 12 వరకు ఢిల్లీలోని ఈస్ట్ వినోద్ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అడ్వెంచర్ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న యాతం నాగబాబు మొత్తం మూడు పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం, 1500 మీటర్లలో ప్రథమ స్థానం సాధించి మరో బంగారు పతకం గెలుచుకున్నారు. అలాగే 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం అందుకున్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మరియు ఎస్పీ కార్యాలయంలో యాతం నాగబాబు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా వారు అభినందనలు తెలియజేశారు. భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ఉప మలేరియా అధికారిగా పనిచేస్తున్న నాగబాబు, కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం జల్లూరు రాపర్తి గ్రామానికి చెందినవారు.

# ప్రత్తిపాడు ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో 8 వ పోషణ పక్వాడ



**కిర్లంపూడి/ప్రత్తిపాడు , పెన్ పవర్, ఏప్రిల్ 13 :** కాకినాడ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 23 తేదీ వరకూ ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 5వ రోజు కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు గ్రామంలో అంగన్వాడీ సెంటర్ నందు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు 2 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్ క్రీం, చక్కెర వంటి పదార్థాలకు, స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు. తమ తమ పిల్లలకు ఇంటి ఆవరణలోను బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీని ద్వారా శారీరకంగా మెరుగుపడడమే కాకుండా, సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులతోపాటు సూపర్వైజర్, ఎన్ వరలక్ష్మి, ఎంపీపీ స్కూల్ హెడ్ మాస్టర్ పాపయ్య, ఐసిడిఎస్ టీచర్లు, హెల్పర్లు, పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వాడపల్లి ఈవో చక్రధర్ రావుకు అదనపు బాధ్యతలు

## అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయ ఈవో ఇన్చార్జిగా బాధ్యతలు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 13:** కోనసీమ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా సేవలందిస్తున్న నల్లం సూర్యచక్రధరరావుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులు, ఆయనను తూర్పు గోదావరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానం (శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం) ఈవోగా ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ మేరకు అధికారిక ఆదేశాలు వెలువడగా, సంబంధిత వర్గాల్లో చర్చనీయాంశమైంది.


ప్రస్తుతం వాడపల్లి దేవస్థానంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న సూర్యచక్రధరరావుకు అదనంగా అన్నవరం వంటి ప్రముఖ దేవస్థానం బాధ్యతలు అప్పగించడం ఆయన పనితీరుకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నారు. అన్నవరం దేవస్థానం రాష్ట్రంలో అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా ఉండటంతో, అక్కడి పరిపాలన బాధ్యతలు కీలకంగా పరిగణించబడుతున్నాయి.

ఇప్పటి నుంచి ఆయన రెండు దేవస్థానాల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు అందించే సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సేవల మెరుగుదల, పారదర్శకత, ఆధునిక సౌకర్యాల విస్తరణపై చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నియామకంతో రెండు దేవస్థానాల మధ్య పరిపాలన సమన్వయం మెరుగుపడి, సేవా కార్యక్రమాలు మరింత సమర్థవంతంగాకొనసాగుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారనుందని భావిస్తున్నారు. స్థానికంగా ఈ నిర్ణయాన్ని భక్తులు ప్రజలు స్వాగతిస్తూ, దేవస్థానాల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 13:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో చరిత్ర విభాగం అధ్యాపకులు రాయుడు శ్రీను భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ అంబేద్కర్ మహానీయత, భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని వివరించారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వ భావనతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. బాలరాజు, విమెన్ ఎంపోవర్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ డి.సత్యలత, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా షరీఫ్



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13;**ఆలమూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది ఎస్.కె షరీఫ్ ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా చల్లా సతీష్, జాయింట్ సెక్రటరీగా గానుగుల శేషారావు, ఉపాధ్యక్షుడిగా కే ధనరాజు, కోశాధికారిగా బి విద్యా ప్రసన్న లు తమ ప్రత్యర్థులపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. అదేవిధంగా మహిళ ప్రతినిధిగా పి రమ్యశ్రీ దుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ ఎన్నికలలో విజయం సాధించిన వారిని పలువురు న్యాయవాదులు నాయకులు అభినందించారు.

## అప్పన్నపాలెంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:** నగర పంచాయతీ పరిధి అప్పనపాలెంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు పరిధిలో ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించ తలపెట్టిన పోషణ పక్వాడ కార్యక్రమం ఐదవ రోజు ఏలేశ్వరం సెక్టార్ కు సంబంధించి సూపర్వైజర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో అప్పనపాలెం అంగన్వాడి సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య కుమారి మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని అన్నారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80% అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్క్రీం, చక్కెర వంటి పదార్థాలకు స్క్రీన్ టీవీ ,మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు. తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయ పడు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఐసిడిఎస్ టీచర్ లు, హెల్పర్ లు, పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## కాకినాడ కలెక్టరేట్‌లో 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' వీక్షణ





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 13:**న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత ప్రభుత్వం నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమాన్ని కాకినాడ కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రభుత్వం, విద్య, శాస్త్ర సాంకేతికం,క్రీడలు, వ్యాపారం,మీడియా,సామాజిక సేవ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొని ప్రసంగించారు.కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన వీక్షణ కార్యక్రమంలో ఏవో ఎస్. రామ్మోహన్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 13:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు అన్నారు. ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో పరిస్థితులన సమీక్షించేందుకు సీఐ ఏలేశ్వరం పోలీస్ స్టేషన్కు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో 22 సెంటర్లలో అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయని ఆయా సెంటర్ల లో అంబేద్కర్ వాదులు, నాయకులు, అభిమానులు, యువత క్రమశిక్షణతో పండగ వాతావరణం లో మహనీయుని జయంతి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఈ వేడుకల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఏలేశ్వరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్. రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై పోలీసు నిఘా:

తమకు అందిన సమాచారం మేరకు గ్రామాల పొలిమేరల లో నియోజకవర్గంలోని పందెవరాయుళ్లు కోడిపందాలు, గుండాటలు, పేకాటలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందని, అలా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆన్లైన్ బెట్టింగ్లపై పటిష్టమైన ప్రత్యేక దృష్టి సారించామని ఆన్లైన్ బెట్టింగ్లో జోలికి ప్రజలు యువత పోరాదని హెచ్చరించారు. ఎవరైనా రహస్యంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం ప్రత్తిపాడు సిఐ: 9440796530, ఏలేశ్వరం ఎస్సై: 9440904835 నంబర్లకు ఫోన్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అలాగే ఏలేశ్వరంలో రిజర్వాయర్ మెయిన్ కెనాల్, విశాఖ లెఫ్ట్ కెనాల్స్ లలో లోతు ఎక్కువగా ఉన్న ప్రమాదకరమైన గుంటలు ఉన్నందున వేసవి సెలవులు సందర్భంగా పిల్లలు స్నానాల కోసం అటువైపు వెళ్ళకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చాలామంది ఈత నేర్చుకోవడానికి వెళ్లి గోతుల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్నారని కావున పిల్లల తల్లిదండ్రులు వారు ఎక్కడికి వెళ్తున్నారు తెలుసుకొని తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు .

## 104 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 13:** జగ్గంపేట నియోజకవర్గంలోని104 లబ్ధిదారులకు రూ.60 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం రావులమ్మ నగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం చంద్రబాబు నాయుడు నిలిచారని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కులం మతం చూడకుండా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు తీసుకువస్తున్నారన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 541 మందికి దాదాపు రూ.15.50 కోట్లు ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చామని ఆయన తెలియజేశారు.

## వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించద్దు



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 13 :** రహదారులపై వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని జగ్గంపేట ఎస్సై టి రఘునాథరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. మెయిన్ రోడ్డుని ఆనుకుని ఉన్న దుకాణాలలోకి వచ్చే వారంతా వారి యొక్క బైకులను రోడ్ కి దిగువ భాగంలో పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగేలా రోడ్డుపై పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా జగ్గంపేట మెయిన్ రోడ్డుపై నిత్యం వ్యాపారం సాగించే తోపుడుబండ్ల వర్తకులు అంత వారి యొక్క తోపుడుబండ్లను ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ఆర్టీసీ బస్సులు బస్సు కాంప్లెక్స్ లోపలికి వచ్చి, వెళ్లే మార్గాలకు అడ్డు లేకుండా రోడ్డుకి దిగువ భాగంలో మాత్రమే పెట్టుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పార్కింగ్ చేసిన, తోపుడుబండ్లను పెట్టి వ్యాపారాలు జరిపిన జరిమానాలు విధిస్తామని ఎస్సై రఘునాథరావు పేర్కొన్నారు.

## అయ్యప్ప స్వామి భక్తులకు సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13;**ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో చేపట్టే అయ్యప్ప స్వామి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందించే అయ్యప్ప స్వామి భక్తులు అన్నందేవుల సూర్యనారాయణ,వీరా గంగరాజు లను సోమవారం ఘనంగా సత్కరించారు. విసు మాల ధరించిన అయ్యప్ప స్వామి భక్తులు పడాల వెంకటేశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో వీరిని శాలువాలు,మెమంటోలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యంగా ఇటీవల బడుగువానిలంక లో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఆరాట్టు కార్యక్రమానికి ఈ భక్తులు అందించిన సహాయ సహకారాలు మరువలేమన్నారు.ఈ కార్యక్రమంలో దూలం తేజ స్వామి,యెరుబండి మధు, సింగవరపు సూరిబాబు, పడాల గోపాలకృష్ణ,మామాజి స్వామి, సూరపురెడ్డి సాయి,జొన్నల సురేష్ తదితరులు ఉన్నారు.

